కథ

# అమృత హస్తం

కె.ప్రవీణరెడ్డి

కవర్లోంచి ఉత్తరం తీసి మళ్లీ చదివాను. ఈసారి నేనా ఉత్తరాన్ని చదివాక మడిచి కవర్లో పెట్టకుండా అక్షరాల వంక చూస్తూండిపోయాను. మనసులో ముద్రపడిన ఆ వాక్యాలను మననం చేసుకుంటున్నాను మరోసారి.

''అన్నయ్యా, బాబుకి మెడికల్ సీటు కోసం ముప్పై లక్షలు డొనేషన్ కట్టాలి. నాదగ్గర పాతిక వున్నాయి. మిగతా ఐదు లక్షలూ నువ్వు సర్దగలవా?... విషయం తెలుపగానే హైదరాబాద్ బయలుదేరతాం. ఆఖరు తేదీ దగ్గర పడుతూంది. ఈ సహాయం చేస్తే నేను జీవితాంతం ఋణపడి వుంటాను.

కాదనవనే ఆశతో...

-పావని

మూడు రోజుల క్రితం నేనందుకున్న ఆ ఉత్తరం క్లుప్తంగా వుంది. అనవసరమైన మాట ఒక్కటి కూడా లేకపోవడం, వాళ్ల అవసరాన్ని భూతద్దంలో చూపుతూంది. మెసేజ్ లాంటి ఆ జాబుని మననం చేసుకున్న నేను ఆలోచనలో పడ్డాను. కొడుకును మెడిసిన్ చదివించాలనుకుంటున్నానని నాతో చాలాసార్లు అన్నది పావని. వాడిని డాక్టరుగా చూడాలనే కోరిక దానిలో ప్రస్ఫుటంగా కనబడేది.

''ఈ పోటీ ప్రపంచంలో ఎమ్సెట్‌లో మంచి ర్యాంకు సాధించి సీటు తెచ్చుకోవడం అంత తేలిక కాదమ్మా...!'' అని నేనంటే ''వాడు చాలా బ్రిలియంట్. అదీ కాక సీటు తెచ్చుకోవాలన్న పట్టుదలతో బాగా కష్టపడుతున్నాడు. ఒకవేళ మెరిట్‌లో సీటు రాకపోతే ఇల్లమ్మి డొనేషన్ కడతానన్నయ్యా...'' అనేది పావని.

ఎమ్సెట్ ఫలితాలు విడుదల కాకముందే ఎన్నారై కోటా సీట్లూ, మేనేజ్‌మెంట్ సీట్లూ ముందుగానే డబ్బుకట్టి రిజర్వ్ చేసుకుంటున్నారు. సీట్ల ధరలు చుక్కలనంటుతున్నా ఎవరూ వెనకాడటం లేదు. మెరిట్‌లో సీటు వస్తే డబ్బు వెనక్కు తీసుకోచ్చు కాబట్టి చాలామంది ముందు జాగ్రత్తగా అప్పో సొప్పో చేసైనా సీటు రిజర్వ్ చేసుకుంటున్నారు. పావని కూడా అలాంటి ఉద్దేశంలోనే వుంది. బహుశా ఇల్లమ్మేసి వుంటుంది. మొన్నామధ్య ఫోన్‌లో మాట్లాడినప్పుడు కూడా పావని తనతో డబ్బు ప్రస్తావన తీసుకురాలేదు. బాబుకు ఇంటర్‌లో మంచి పర్సంటేజే వచ్చిందనీ ఎమ్సెట్‌కి బాగా ప్రిపేరయ్యాడనీ మాత్రం చెప్పింది. బహుశా ముఖాముఖిని అడగలేకపోయిందేమో...?

ఐదు లక్షలు.. చిన్నమొత్తం కాదు.. నేను సర్దలేనా?.. తర్కంలో పడ్డాను. నా కూతురు పెళ్లికి దాచిన డబ్బుందిగా.. అందులోంచి ఇస్తే సరి.



అమ్మో నీరజ వూరుకుంటుందా..? ఇందులో నీరజకేం హక్కుంది? ఆ డబ్బు నా స్వార్జితం.. కానీ నీరజ నా అర్ధాంగి. ఆ డబ్బు జమ చేయడంలో ఆమె సలహా, సహకారం పూర్తిగా వున్నాయి. ఇప్పుడా డబ్బు తీస్తే బ్రహ్మరాక్షసిలా విరుచుకుపడదూ.. అదీ నా చెల్లెలికివ్వడం అంటే మరీ రాద్ధాంతం చేస్తుంది.

మూడేళ్ల క్రితం అమ్మ పోయినప్పుడు వచ్చివెళ్లిన పావని ఆ తర్వాత నాతో ఫోన్లో మాట్లాడటమే తప్ప ఈ ఇంటి గడప తొక్కలేదు. పావని భర్త యాక్సిడెంట్‌లో పోయి పదేళ్లవుతూంది. వైజాగ్‌లో భర్త పనిచేసిన కంపెనీలోనే కంపాషనేట్ (గ్రౌండ్స్) మీద ఉద్యోగం ఇచ్చారు. ఒక్కగానొక్క కొడుకు డాక్టరవ్వాలని దాని కోరిక. నాకు డబ్బు ఇవ్వాలనే వుంది. కానీ నీరజకు తెలియకుండా నేనా పని చేయలేను. జాయింట్ అకౌంట్‌లో వున్న ఆ డబ్బు ఆమె సంతకం లేకుండా తీయడం సాధ్యం కాదు. ఇప్పుడీ ఉత్తరం నీరజ కంటబడితే అగ్గిమీద గుగ్గిలం అవుతుంది. పావనికి నా భార్య స్వభావం తెలిసి కూడా నన్నడిగిందంటే దానికి ఇంకెక్కడా డబ్బు పుట్టే అవకాశం లేదన్నమాటే..? ఎలా మరి? ఏం చేసేది?.. నాకేదోలా అనిపించింది... గుండెల్లో ఏదో గుబులు... ఏనాటివో మనసు పొరల్లో పదిలంగా ఉన్న జ్ఞాపకాలు కళ్ల ముందు తిరుగుతున్నాయి.

★ ★ ★

పావని నా కంటే ఐదేళ్లు చిన్నది. ఎప్పుడూ నన్నంటిపెట్టుకొని నాకూడా తిరిగేది. బొద్దుగా ముద్దుగా వుండేది. బుడిబుడి నడకలతో నాతోపాటుగా బడికి వచ్చేది. దాని తరగతిలోకి వెళ్లకుండా నాతోబాటు కూర్చుంటానని మారాం చేసేది. ఆటల్లో ఎప్పుడన్నా నాకు గాయమై రక్తం వస్తే అది విలవిలలాడిపోయేది. నాకంటే ఎక్కువ అదే ఏడ్చేసేది. నేను స్కూలు ఫైనల్ కొచ్చేసరికి చదువు గాలికి వదిలి స్నేహితులతో షికార్లు కొడుతూ, రిలీజైన ప్రతి సినిమా చూడటమే ధ్యేయంగా పెట్టుకున్నాను. దాంతో అమ్మా నాన్నలు నన్ను స్తమానం తిడుతూ వుండేవాళ్లు. నా చేతికి చిల్లర డబ్బులు కూడా దొరకనివ్వకుండా కట్టడి చేశారు. నా సరదాలను ఆకతాయి వేషాలుగా కొట్టిపారేసేవాళ్లు. చెల్లికెప్పుడైనా అమ్మ చాక్లెట్లు కొనుక్కొమ్మని డబ్బులిస్తే ఎలాగైనా కాజేయాలనుకునేవాడిని.

''నా పెన్సిలెవరో కొట్టేశారే, రేపటి హోంవర్క్ చేయకపోతే మాస్టారు చావగొడతారు. ఆ నెప్పితో చస్తాను. అమ్మనడిగితే డబ్బులివ్వదు సరికదా రెండు తగిలిస్తుంది.. ఇప్పుడేం చెయ్యనూ..'' అంటూ దీనంగా మొహం పెట్టి కళ్లల్లోకి నీళ్లు కూడా తెచ్చుకునేవాడిని. అది నా మాటలు నమ్మేసి ఆ డబ్బులు నాకిచ్చేది. డబ్బు చేతిలో పడగానే నా సహజ నటనకి నన్ను నేనే అభినందించుకుంటూ క్షణంలో అక్కడ్నించి అదృశ్యమయ్యేవాడిని. పరీక్షల్లో తప్పినప్పుడల్లా నాన్న నాలుగు తగిలించి వీడికీ పూట అన్నం పెట్టొద్దు అని అమ్మనాజ్ఞాపించేవారు... ఆయనకు భయపడి అమ్మ దాన్ని అక్షరాలా అమలుపరిచేది. కానీ చెల్లి మాత్రం నేను తినడానికేదన్నా దొంగచాటుగా తెచ్చి పెట్టేది.

మామయ్యా, బాబాయి వాళ్లు చుట్టపుచూపుగా ఇంటికి వచ్చి తిరిగి వెళ్లేటప్పుడు నాకూ చెల్లికీ డబ్బులిచ్చేవాళ్లు. నావి గంటలో ఖర్చయ్యేవి. పావని కాంపాస్ బాక్స్‌లో భద్రంగా దాచుకున్న డబ్బు కూడా మాయం చేసేవాడిని. అది కాస్త పెద్దయ్యాక నాన్న ఇచ్చే పాకెట్ మనీ తెలివిగా ఏ బియ్యం డబ్బాలోనో, అటక మీది పెట్టెలోనో దాచుకునేది. నేను వెతికి తీసుకుని స్నేహితులతో సినిమాకు చెక్కేసేవాడిని. అదేంటోగానీ నాకెంత డబ్బైనా చాలకపోయేది. ఒక్కోసారి చిరుతిళ్లకీ, సినిమాలకీ చేతిలో డబ్బు లేకపోతే చెల్లితో ''నాకు తక్షణం పది రూపాయలివ్వు, లేకపోతే ఈ క్షణమే మేడ దూకి ఛస్తాను'' అంటే అది నిజంగానే బెదిరిపోయి అమ్మ తన బీరువాలో చీర మడతల్లో దాచిన డబ్బు తెచ్చేసి చీవాట్లు తినేది. నాకు డబ్బు అవసరం పడినప్పుడల్లా ఒకటే ఆయుధాన్ని ప్రయోగించేవాడిని. అది నేను చేస్తానని బెదిరించడం, దాంతో చెల్లి అమ్మనీ నాన్ననీ బతిమాలి పదో పరకో తెచ్చి నా చేతికిచ్చేది.

నేను ఇంటెర్మీడియెట్ మళ్లీ తప్పడంతో నాన్న మరోసారి పరీక్ష ఫీజు కట్టడం కూడా దండగ అనుకున్నారు. ఆ రామారావుగారి ఫ్యాక్టరీలో ఏదైనా పనిలో కుదిరిస్తాను అని ఆయన గట్టిగా నిర్ణయించుకోవడంతో నేనీసారి ఎలాగైనా పాసవ్వాలనే పట్టుదలతో పుస్తకాలు ముందేసుకుని చదువుతున్నాను.

## కొత్త సదా!

**ముంబాయి నుంచి వచ్చి తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో గత నాలుగేళ్లుగా నటిస్తున్న సదా తిరిగి ముంబయ్ వెళ్లి బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకుంటోందని ఆమె సన్నిహితులంటున్నారు. ఇటీవల కాలంలో గ్లామరస్ గెటప్పుల్లో ఎక్కువగా దర్శనమిస్తున్న సదా హిందీ చిత్రాల్లో ప్రయత్నాలు ముమ్మరం చేసిందిట. 2008 సంవత్సరం హిందీ తారగా సదాకి కొత్త ఆశల్ని కలిగిస్తుందేమో చూడాలి!**



అయినా నాన్న నన్ను నమ్మలేదు. పావని నా ఫీజు కోసం తన మెడలోని గొలుసు ఇచ్చింది. ఎక్కడో పడిపోయిందని చెప్పి వాతలు తేలేలా చెంప దెబ్బలు తిన్నది. నేనీసారి ఇంటర్ పాసయ్యాను.

అది దాని చలవే...

నేను బి.కాంలో జాయినయ్యాను. ఎదురింటి రాగిణితో ప్రేమలో పడ్డాను. పుస్తకాల్లో ప్రేమలేఖలు పెట్టి మార్చుకునేవాళ్లం. పుస్తకాల మార్పిడికి పావనే సాయం చేసేది. నా చదువు పూర్తవక ముందే రాగిణికి అమెరికాలో జాబ్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో పెళ్లి కుదిరింది. ఆ సంగతి తెలిసిన నేను ఒక్కసారి రాగిణిని కలిసి మాట్లాడాలనుకున్నాను. పావనితో రాయబారం పంపాను. రాగిణి సమాధానమేమిటో తెలుసుకోవాలని ఆత్రంగా ఎదురు చూస్తున్నాను. తిరిగి వచ్చిన పావని నన్ను

ఎట్టుకొని ఏడ్చేసింది. ఆ ఏడుపులో నాకు విషయం అర్థమైంది. ''నువ్వూ బాగా చదువుకొని మంచి ఉద్యోగంలో చేరిపో అన్నయ్యా..'' వెక్కిళ్ల మధ్య అన్నది.

నా డిగ్రీ పూర్తయ్యింది. పి.జి చేస్తూనే బ్యాంక్ ఎగ్జామ్స్ రాశాను. చెల్లి పెళ్లయ్యింది. అత్తారింటికి వెళ్తూ తను దాచుకున్న డబ్బంతా నా చేతిలో పెట్టి నన్ను హత్తుకుని ఏడ్చేసింది...

పావని వెళ్లిపోయాక ఆ ఇంట్లో నా చుట్టూ ఏదో ఒంటరితనం ఆవరించినట్లనిపించింది. ఇన్నేళ్లు గడిచినా ఆ భావం నన్నంటిపెట్టుకొనే వుంది. ''నేను చస్తాను'' అని బెదిరించినప్పుడు దాని కళ్లల్లో కనిపించిన భయం నాకింకా గుర్తుంది. ఆకతాయి పనులు చేసి నాన్నతో దెబ్బలు తిని నేనేడుస్తూండే చిట్టిచేతుల్తో నా కన్నీళ్లు తుడిచిన స్పర్శ నా చెంపలపై పారాడుతున్నట్టే అనిపించడంతో అసంకల్పితంగా నా చేయి చెంపని తుడుముకుంది. పావని నాకు ఆనాడు ఇచ్చిన చిల్లరతో బాటు పంచిన ప్రేమానురాగాలకు విలువ కట్టలేను. నీరజను ఎలాగైనా ఒప్పించి పావనికి డబ్బివ్వాలి అనుకుంటూ కుర్చీలోంచి లేవబోయాను. కానీ ఏదో అశక్తత నన్నావహించింది. ఇంతలో నీరజ గదిలోకి వచ్చింది.

''చీకటి పడుతూంది.. లైటన్నా వేసుకోకుండా అలా కూర్చున్నారేమిటి?'' అంటూ లైటు వేసి దగ్గరగా వచ్చింది.

''బాగా చెమటలు పట్టాయెందుకు? బయట చల్లగానే వుందే! ఏమిటది చేతిలో..'' అంటూ నా చేతిలోని ఉత్తరాన్ని తీసుకుంది. ఆమె ఒక్క క్షణంలో చదివేసింది.

''నిన్నటినుంచీ అపురూపంగా ఈ కాగితం ముక్క చేతిలో పట్టుకు తిరుగుతూంటే ఇలాంటి విషయమేదో ఉందని అనుకుంటూనే ఉన్నా.. కొంపదీసి ఆవిడగారికి డబ్బు ఇవ్వదల్చుకున్నారా ఏమిటి?.. నా ప్రాణం పోయినా ఒప్పుకోను. పిల్ల పెళ్లికి దాచిన ఆ డబ్బులోంచి పైసా తీసినా నన్ను చంపుకు తిన్నంత ఒట్టు..'' ఖంగుమంటూంది ఆమె కంఠం. ఆ తర్వాతి మాటలు నాకు వినబడలేదు. కానీ ఆమె పెదాల కదలిక మాత్రం కన్పిస్తూంది. 'చంపుకు తిన్నంత.. ఒట్టు.. చంపుకు తిన్నంత..' నా చెవుల్లో ఆ పదమే గింగిర్లు తిరుగుతూంది. కళ్లముందు చిన్ననాటి దృశ్యాలెన్నో అలుక్కుపోయినట్లుగా కదలాడుతున్నాయి.

ఆనాడు మాస్టారు నన్ను కొట్టి చంపేస్తాడంటే నమ్మి, చాక్లెట్ కొనుక్కు తినాలన్న తన చిన్ని కోర్కెను చంపుకొని నా చేతుల్లో చిల్లర డబ్బులు పోసిన చిన్నారి..

పుట్టింటికి వచ్చినప్పుడల్లా ''అన్నయ్యా! నువ్వసలే ఖర్చు మనిషివి. ఇంకా ఉద్యోగం రాలేదు, ఎలా నెట్టుకొస్తున్నావో!'' అంటూ గుట్టుగా డబ్బులిచ్చిన కల్పవల్లి.. భర్త పోయాక మగదిక్కు లేకుండా ఇన్నాళ్లూ ఎట్లా నెట్టుకువచ్చిందో..? అభిమానవతి తన చెల్లెలు.. ఎంత తప్పని పరిస్థితుల్లో ఈ సాయం నన్నడిగిందో... ఆనాడు తన పసితనపు కోరికలను చంపుకొని చిల్లర డబ్బులిచ్చిన చిన్నారి పావని ముఖమే కళ్లముందు కదులుతూంది... నీరజకేం తెలుస్తుంది, ఇరవై ఏళ్లు కలిసి పెరిగిన మా అన్నా చెల్లెళ్ల అనుబంధం... అది మాటల్లో చెప్పగనిది. చెప్పినా నీరజ అర్థం చేసుకోలేదు.

మా అమ్మాయికిప్పుడు పదిహేడేళ్లు. చక్కగా చదువుకుంటూంది. నిజానికి పెళ్లికిప్పుడు తొందర లేదు. వెంటనే చేసే ఆలోచన కూడా లేదు. పావనికి డబ్బివ్వాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.. నీరజతో చెప్పబోయాను. కానీ నోట్లోంచి మాట బయటికి రావడం లేదు. గుండెల్లో ఏదో కలుక్కుమన్నట్లయ్యింది... నెమ్మదిగా పక్కకు ఒరిగిపోతున్నాను... మగత కమ్మినట్లయ్యింది... నా కళ్లు మూసుకుపోతూండగా ఇంట్లోకి వచ్చిన పావని కనిపించింది.

★ ★ ★

నేను కళ్లు తెరిచేసరికి హాస్పిటల్లో వున్నాను. ఏం జరిగిందో నాకర్థం కాలేదు. తరువాత విషయమంతా తెలిసింది. తీవ్రమైన గుండెపోటుతో స్పృహ కోల్పోయిన నన్ను హాస్పిటల్లో అడ్మిట్ చేశారట. వెంటనే సర్జరీ చేయాల్సివచ్చింది. ఇప్పుడు నేను బాగా కోలుకున్నానని డాక్టర్లు చెప్పారు. విజిటర్స్ టైమ్‌లో ఐ.సి.యులో వున్న నాదగ్గరకు నీరజ వచ్చింది.

''బాగా కంగారుపడి వుంటావు కదూ.. ఇలాంటి పరిస్థితిలో..'' నాకా పైమాట పెగలలేదు.

''నేను కంగారుపడ్డ మాట నిజమే.. కానీ నాకు రవ్వంత కష్టం కూడా కలగకుండా అన్నీ పావనే చూసుకుంది'' అంటూ నీరజ తలుపు వైపు చూపింది. గ్లాస్ డోర్ వెనకాల పావని కనిపించింది.

''మిమ్మల్నా స్థితిలో చూసి కాళ్లూ చేతులాడలేదు నాకు. ఆ సమయంలో దేవతలా వచ్చింది. వాళ్లబ్బాయి మెడికల్ సీటు రిజిస్టర్ చేసుకోవడానికి గడువు దాటుతున్నా ఆ విషయం వదిలేసి తన చేతిలో ఉన్న డబ్బు హాస్పిటల్ వాళ్లకు కట్టింది. ఆపరేషన్ సమయంలో మీకు రక్తం కావాల్సొచ్చింది. మీదసలే రేర్ బ్లడ్ గ్రూప్. పావనిదీ అదే గ్రూప్ అవడం నా అదృష్టం. ఇవన్నీ ఒక ఎత్తవుతే ఆ సమయంలో నాకు తోడుగా ఉండి మనోధైర్యం ఇవ్వడం మరో ఎత్తు. ఆవిడ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం..''

నిజమే.. నేనెప్పటికీ ఋణగ్రస్తుణ్నే.. చిన్నప్పుడు మాటమాటకీ చస్తానని బెదిరించి పావని దగ్గర డబ్బు లాగేవాడిని.. ఈసారి నిజంగానే మృత్యుముఖం లోంచి తన అమృత హస్తంతో నన్ను బయటికి లాగింది.

☆

## ష్! సమీరా!!

**సమీరా రెడ్డి 'రేస్' అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఇందులో ఆమెతోపాటు కత్రినాకైఫ్, బిపాషా బసు కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముగ్గురు హీరోయిన్లున్నారు గనక తన పాత్రకి అంతగా ప్రాధాన్యత వుంటుందా వుండదా అనే డౌటు సమీరాకి రావడం, దర్శకుడు అలాంటిదేం లేదు, మంచి ఇంపార్టెన్సే వుందని చెప్పడం జరిగిందిట. కానీ ఇప్పుడా సినిమా రిలీజ్‌కి తుదిమెరుగులు దిద్దుకుంటున్నప్పుడు సమీరా పాత్ర చాలావరకు కత్తెరకు గురైందని విన్న సమీరా నిర్మాతా దర్శకులను నిలదీసిందిట. అబ్బెబ్బే అలాంటిదేం లేదని మళ్లీ పాత పాటే పాడిన దర్శకనిర్మాతల్ని నమ్మడం లేదట సమీరా. సినిమా రిలీజయ్యే వరకూ అసలు సంగతి తెలియదు మరి!**

